Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 69 | Sunday 09.02.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 69 | శనివారం 0902. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

ఢిల్లీ ప్రజలు ఇకపై ఆధునిక నగరాన్ని...

## చూడబోతున్నారు

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జయభేరి - ఆప్ ను చిత్తు చేసి ఢిల్లీ పీఠం చేజిక్కించుకున్న కాషాయ దళం**
**విజయోత్సవ సభకు హాజరైన ప్రధాని మోదీ - ఢిల్లీ ప్రజలు అభివృద్ధి వైపు నిలిచారని వెల్లడి**
**అవినీతిపై పోరాడతామన్న వారే అవినీతిలో కూరుకుపోయారని విమర్శలు**



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** గతంలో ఎన్నడూ లేనంతగా హెూరాహెూరీగా సాగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ మళ్లీ పాగా వేసింది. ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఢిల్లీ ప్రజలు ఇకపై ఆధునిక నగరాన్ని చూడబోతున్నారని అన్నారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల్లో నిజమైన అభివృద్ధి చూడొచ్చని పేర్కొన్నారు. పనితీరు ఆధారంగానే అనేక రాష్ట్రాల్లో మళ్లీ బీజేపీకే అధికారం ఇస్తున్నారని తెలిపారు. హర్యానాలో సుపరిపాలనకు నాంది పలికామని, మహారాష్ట్ర రైతులకు అన్ని విధాలుగా అండగా ఉన్నామని మోదీ చెప్పారు. బీహార్ లో నితీశ్ కుమార్ కూడా ఎన్డీయేపై విశ్వాసం ఉంచారని, ఏపీలో చంద్రబాబు తన ట్రాక్ రికార్డు నిరూపించుకున్నారని వివరించారు. బీజేపీ పథకాలు పేదలు, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా

మిగతా 2 లో

ఆప్‌ను ప్రజలు...

## తిప్పికొట్టారు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకోలేదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సంక్షేమం, తాయిలాలతో ప్రజలను మభ్యపెట్టాలని కేజ్రీవాల్ చూశారని విమర్శించారు. ప్రజల్లో స్పష్టమైన మార్పు తాము ప్రచారం చేసినప్పుడే కనిపించిందని అన్నారు. ఢిల్లీలో వెహికల్ పొల్యూషన్‌తో పాటు పొలిటికల్ పొల్యూషన్ ఉందని అన్నారు. బీజేపీ గెలుపుతో పొలిటికల్, వెహికల్ పొల్యూషన్ పోతాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, తాను ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారం చేసిన చోట బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారు ఏం మాట్లాడాలనేది ముందుగానే నిర్ణయించుకుంటారని

మిగతా 2 లో

బీజేపీ 48 స్థానాలతో...

## చారిత్రక విజయం

- బీజేపీ 48... ఆప్ 22...
- ఢిల్లీలో ముగిసిన ఓట్ల లెక్కింపు
- ఢిల్లీ అసెంబ్లీలో 70 సీట్లు
- ఈ నెల 5న అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీ పీఠం చేజిక్కించుకున్న బీజేపీ
- మట్టికరిచిన అధికార ఆప్
- కనీసం ఉనికిని చాటుకోలేకపోయిన కాంగ్రెస్




న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసింది. బీజేపీ 48 స్థానాలతో చారిత్రక విజయం సాధించగా, ఆమ్ ఆద్మీ పార్టీ 22 స్థానాలతో సరిపెట్టుకుంది. కౌంటింగ్ ముగిసే సమయానికి బీజేపీ 47 స్థానాలు కైవసం చేసుకోగా, ఓ స్థానంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలు ఉన్నాయి. ఈసారి కూడా తామే గెలుస్తామని ఆప్ నిబ్బరంగా

మిగతా 2 లో

బీఆర్ఎస్‌కు అనుకూలమైన...

## వాతావరణం ఉంది : కేటీఆర్




హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితికి (బీఆర్ఎస్) అనుకూలమైన వాతావరణం ఉందని, ముఖ్యమంత్రిగా కె. చంద్రశేఖర రావు తిరిగి రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వికారాబాద్ జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే పది, పదిహేను రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వికారాబాద్‌లో ఆరు జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయని, గెలిచే అవకాశాలున్న

మిగతా 2 లో

కేటీఆర్ నుండి అలాంటి ప్రకటన...

## ఆశ్చర్యాన్ని కలిగించింది

ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో... కేటీఆర్‌కు మంత్రి కొండా సురేఖ కౌంటర్
మీ మోదీ అంకుల్ గెలుపులో మీ సోదరి కీలక పాత్ర పోషించిందని ఎద్దేవా
నెక్స్ట్ టైమ్ బెటర్ లక్ అంటూ కేటీఆర్‌కు చురక



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** మీ మోదీ అంకుల్ గెలుపులో కీలక పాత్ర పోషించిన మీ సోదరి కవితను అభినందించాలని మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో బీజేపీ గెలిచిన నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. బీజేపీ విజయానికి కృషి చేసిన అతిపెద్ద కార్యకర్త రాహుల్ గాంధీయేనని

మిగతా 2 లో

ఏపీ, ఢిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని కష్టాల నుంచి...

## బయటపడ్డారు : సీఎం

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు స్పందన**
**ఏపీలోనూ, ఢిల్లీలోనూ ప్రజల ఆకాంక్షలు పట్టించుకోలేదని వెల్లడి**
**ఓటేసిన పాపానికి ప్రజలను కాటేశారని విమర్శలు**



ఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ఉండవల్లిలోని నివాసంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ రోజు ఢిల్లీలో బీజేపీ గెలుపు, కేవలం ఢిల్లీ ప్రజల గెలుపు కాదని... ఇది దేశ ప్రజల గెలుపు కూడా అని అభివర్ణించారు. పీపుల్స్ ఫస్ట్ అనే మోడల్ మాత్రమే పని చేస్తుందని ఈ ఎన్నిక మరోసారి నిరూపించిందని అన్నారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ

మిగతా 2 లో

ఆర్థిక భరోసా కలిగించేలా యూనిట్లఏర్పాటుకు...

## సబ్సిడీతో రుణాలు

2 నెలల్లో వంద శాతం మేర... 'బీసీ' యూనిట్లు గ్రౌండింగవ్వాలి : రాష్ట్ర బీసీ శాఖ మంత్రి సవిత




తిరుపతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఆర్థిక సంవత్స రం మరో రెండునెలల్లో ముగియనుందని, ఆలోగా బీసీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో అందజేస్తున్న స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి, యూనిట్లు గ్రౌండింగయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. శనివారం తిరుపతిలో పద్మావతి గెస్ట్

మిగతా 2 లో

ఢిల్లీ ప్రజలు మార్పుకు...

## ఓటు వేశారు : ప్రియాంకా



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన ప్రత్యర్థి ఆప్ ను చిత్తు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. వరుసగా మూడోసారి సున్నా స్థానాలకు పరిమితమయింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ మాట్లాడుతూ... ఢిల్లీ ప్రజలు 'మార్పు'కు ఓటు వేశారని

మిగతా 2 లో

# సంపాదకీయం

## గులాబీ బాస్‌కు ఓటమి భయం..!

హైదరాబాద్, : తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంటున్నా రెండు సార్లు అధికారం చెలాయించిన బీఆర్ఎస్‌లో మాత్రం చలనం కనిపించడం లేదు. తమకు అంతో ఇంతో పట్టున్న కరీంనగర్ నుంచి తాము పోటి చేస్తామని పలువురు ఆశావహులు ముందుకొస్తున్నా.. గులాబి బాస్ మాత్రం పోటీకి ససేమిరా అంటున్నారంట. ఏ ఎన్నికలు అయినా ఉప ఎన్నికలు అయినా సై అంటూ గేరు మార్చి స్పీడ్ పెంచే కారు పార్టీలో ఈ సారి మాత్రం అసలు కదలికే కనిపించడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతున్నా.. ఆ పార్టీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఇప్పటికీ ఇంకా సైలెంట్‌గా ఉండడానికి కారణం ఏంటి?తెలంగాణ రాష్ట్రం లో ఖాళీ అయిన రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. నామినేషన్ల పర్వం కొనసాగుతుంది.. అయితే ఆ ఎన్నికలతో తమకేం సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు గులాబీ పార్టీ పెద్దలు.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్‌తో.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ అంటే భయపడి పోతున్నట్లు కనిపిస్తున్నారు. నామినేషన్ల పర్వం కొనసాగుతున్న ఇప్పటికి పోటీ చేసే విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పరాజయం పాలైతే ఆ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై మరింత రిఫ్లెక్ట్ అవుతుందన్న ఆందోళనతో ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారంట.వాస్తవానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులకి పదేళ్లలో బిఆర్ఎస్ పార్టీ చేసిందేమి లేదు. ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రెండు సార్లు అధికారంలో ఉన్న పట్టభద్రుల సమస్యలు తీర్చడంలో బిఆర్ఎస్ పూర్తిగా విఫలం అయ్యిందన్నది కాదనలేని వాస్తవం.. ఇది గత ఎమ్మెల్సీ ఎన్నికలలోనే రుజువు అయ్యింది. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉండాలని అధికారం లో ఉన్న బీఆర్ఎస్‌ని కాదని పెద్దాయన జీవన్ రెడ్డి కి పట్టం కట్టారు కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓటర్లు.అధికారం లో ఉన్నప్పుడే పట్టభద్రులు తిరస్కరించడంతో.. ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయాలంటేనే ఆమడ దూరంలో ఉంటుంది బీఆర్ఎస్.. అసెంబ్లీ ఎన్నికలలో పరాజయంతోనే కుంగి పోయిన కారు పార్టీకి పార్లమెంటు ఎన్నికలలో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోలేక గుండుసున్నాకే పరిమితం అయ్యింది. రెండు సార్లు అధికారం వెలగపెట్టిన ఆ పార్టీకి సగం లోకసభ స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కలేదంటే.. ప్రజలు ఆ పార్టీని ఏ స్థాయిలో తిరస్కరించారో అర్థమవుతుంది.ఆ దెబ్బతో పార్లమెంటు ఎన్నికల తరువాత గులాబాస్ కెసిఆర్ పూర్తిగా ఫాంహౌస్ కే పరిమితం అయ్యారు. ఆయన అధికారం లో ఉన్నప్పుడు ఏనాడు కూడా బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణం పై దృష్టి పెట్టలేదు. ఎవరిని నిలబెట్టినా తన ముఖం చూసి ఓటేస్తారన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో సంస్థాగతం పార్టీని బలోపేతం చేయాలన్న అంశాన్నే పట్టించుకోలేదు. ఆ ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. గతంలో బీఆర్ఎస్‌లో చేరడానికి నేనంటే నేనని పోటీ పడి వచ్చిన నాయకులు ఇప్పుడు నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యమం సమయం నుంచి ఆ పార్టీతో ఉన్న వారు తప్ప అధికారాన్ని చూసి వచ్చి చేరిన వారంతా కారు దిగేసి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు.పార్లమెంటు ఎన్నికల తరువాత కేసీఆర్ ప్రజలకు దూరమవ్వడంతో.. బీఆర్ఎస్ పార్టీ జవసత్వాలు లేకుండా తయారైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు ఎంత బూస్టప్ ఇవ్వడానికి ట్రై చేస్తున్నా.. వలసలు మాత్రం ఆగడం లేదు. ఉన్న నాయకులు, కేడర్ కూడా పార్టీ పిలుపు ఇస్తే తూతు మంత్రంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణం కోసం ఒక్కటంటే ఒక్క మీటింగ్ కూడా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఓటమి తరువాత నిర్వహించలేకపోయారు.అటు చూస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెలాఖరులో భారీ బహిరంగసభ అంటున్నారు. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు ఫలితాలు వెలువడతాయి. అంటే 28 రోజులు మాత్రమే ఉండే ఫిబ్రవరి నెల ఆఖరులో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. మరి అటువంటప్పుడు కేసీఆర్ భారీ బహిరంగ సభ ఎలా పెడతారో? అన్న డౌట్లు గులాబీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతున్నాయి.ఏడాది నుంచి కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమై .. అప్పుడప్పుడు స్టేట్‌మెంట్లకు పరిమితమవుతుండటంతో గులాబీ కేడార్ ఆయన్ని నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. అది గ్రహించే అసలు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సంగతే మర్చిపోయినట్లు కేసీఆర్ వ్యవహరిస్తున్నారంట. స్థానిక సంస్థలు సమీపించడానికి ముందు ఎమ్మెల్సీ పోరులో నిలబడి అంతో ఇంతో సత్తా చాటుకుంటే పార్టీకి జవసత్వాలు వచ్చేవని.. అయితే ఆయన అసలుకే కాడె వదిలేయడం కేడర్‌కు మింగుడు పడటం లేదంట. దాంతో క్యాడర్ కూడా అధిష్టానం లేని పట్టింపు మాకేం అనుకుంటున్నారో ఏమో అసలా ఎన్నికల గురించి ఆలోచించడమే మానేశారు.తెలంగాణలో బీఆర్ఎస్ గ్రౌండ్ లెవల్ నుండి బలంగా ఉండేది. ఉద్యమ పార్టీ నుంచి పొలిటికల్ పార్టీగా మారడంతో గట్టి క్యాడరే ఉంది. అయితే ఇప్పుడు కార్యకర్తలకి దిశానిర్దేశం చేసేవారే కరువయ్యారు. అటూ కేసీఆర్ పూర్తిగా రెస్ట్‌లో ఉండడం.. దిశానిర్దేశం చేయాల్సిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి కేసులతో అవినీతి మరకలు అంటుకోవడం.. ఆయన పార్టీ బలోపేతం కంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించడానికే ప్రాధాన్యత ఇస్తుండటం.. కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కాం కేసులో ఇరుక్కుని జైలుకి వెళ్ళిరావడం ఇప్పుడు బీఆర్ఎస్ ని పూర్తిగా డిఫెన్స్‌లో పడేసిందని చెప్పవచ్చు..ఇలాంటి పరిస్థితుల్లో కేడర్‌ని యాక్టివ్‌గా ఉంచాలంటే ఏదో ఒక యాక్టివిటీ కావాలి. ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపోటములు ఎలా ఉన్నా పోటీ చేస్తే పార్టీకి పునరుజ్జీవం వస్తుందని పార్టీ శ్రేణులు భావించాయి. అయితే ఎలాగూ పట్టభద్రులు గత ఎన్నికలలో కొర్రు కాల్చి వాతలు పెట్టారు. వారికి ఇస్తాన్న నిరుద్యోగ భృతి ఎలాగూ ఇవ్వలేదు. ఉద్యోగాల నోటిఫికేషన్ లు వేయలేదు. ఇంకా పట్టభద్రులు మనకేం అండగా ఉంటారనుకున్నారేమో గులాబీ బాస్ ఎప్పటిలాగే తన నిర్ణయం తాను తీసేసుకోవడంతో కేడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతుంది.కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లై కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ తాను పోటీ చేస్తానని ముందుకు వచ్చినా కేసీఆర్ గ్రీన్ సిగ్నెల్ ఇవ్వడం లేదంట. ప్రసన్న హరికృష్ణ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. హరికృష్ణ తన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎమ్మెల్సీ గా పోటీ చేయడానికి ముందుకు వచ్చి నాలుగు నెలల ముందు నుండే పట్టభద్రుల ఓటర్లను కలుస్తున్నారు. పట్టభద్రుల్లో హరికృష్ణకి పాజిటివ్ నెస్ ఉండడంతో బీఅర్ఎస్ నేతలు తమ పార్టీ తరుపున హరికృష్ణ బరిలో ఉంటే గెలిచే అవకాశం ఉందని కెటీఆర్, హరీష్‌రావుల దృష్టికి తీసుకెళ్లారంట. వారు ఆ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే.. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేసే అవకాశం లేదని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పేశారంట. కేసీఆర్ దానికే ఫిక్స్ అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో? ఇప్పటి నుంచే పార్టీ కేడర్ ఊహించేసుకుంటుందంట.

# రోజుకు 300 మందికి కుక్కకాటు...

హైదరాబాద్, :: గ్రేటర్ హైద్రాబాద్‌లోనే కాదు.. తెలంగాణ అంతటా గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. వీధికుక్కల దాడుల్లో, గత మూడేళ్లలో తెలంగాణలో 36 మంది మృత్యువాత పడ్డారు. ఇక 3 లక్షలమందికి పైగా కుక్క కాటుకు ఆస్పత్రుల పాలయ్యారు. ఒక్క హైదరాబాద్ మహానగరంలోనే లక్ష మందికి పైగా కుక్కకాటు బాధితులు హాస్పిటల్స్‌కి క్యూ కట్టారు. తెలంగాణ హైకోర్టు సుమోటోగా ఈ కేసు తీసుకోవడంతో ఈ లెక్కలన్నీ అధికారికంగా బయటపడ్డాయి. హైదరాబాద్‌లో ఇంత ప్రమాదకర స్థాయిలో వీధి కుక్కల దాడులు పెరిగిపోవడానికి కారణం ఏంటి? ఇంతకీ అధికారులు ఏం చేస్తున్నారు. ఇక గత మూడేళ్లలో హైదరాబాద్‌లో వీధికుక్కల దాడులు ఏ మేరకు పెరిగాయో చూడండి.తెలంగాణలో కుక్కల బెడద ఆందోళనకర స్థాయికి చేరుకుందని గణాంకాలు చూపిస్తున్నాయి.. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 300 కి పైగా కుక్క కాటు సంఘటనలు నమోదవుతున్నాయని.. వీటిలో గ్రేటర్ హైదరాబాద్‌లోనే 100 కేసులు ఉన్నట్లు నివేదికలు తెలిపాయి..

హైదరాబాద్‌ని వణికిస్తున్న వీధికుక్కల దాడులు

హైదరాబాద్‌లో 2022లో 31,141 కుక్క కాటు కేసులు నమోదు

2023లో 36,849 కేసులు నమోదు

2024లో 42,067కి పెరిగిన సంఖ్య

మొత్తం 1,10,057 కుక్కకాటు కేసులు నమోదు

మూడేళ్లలో 35 శాతం పెరిగిన వీధికుక్కల దాడులు

తెలంగాణలో నమోదైన కేసులు 3,33,935

వీధికుక్కల దాడుల్లో 2022లో 8మంది, 2023లో 15మంది, 2024లో 13మంది ప్రాణాలు కోల్పోయారు

గత ఏడాది మేడ్చల్-మల్కాజిగిరిలో అత్యధికంగా 14,686 కేసులు నమోదు

ఈ మొత్తం వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ హైకోర్టు.. సుమోటోగా కేసును స్వీకరించింది. హైకోర్టు ఆదేశాలతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్? వీధి కుక్కల నియంత్రణకు, వాటి సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై నివేదికను తయారుచేసి హైకోర్టుకు నివేదించింది. ఆ నివేదికలో వీధి కుక్కలను నియంత్రించడానికి హైదరాబాద్‌లో 5 డాగ్ షెల్టర్స్‌ని ఏర్పాటు చేశామని పేర్కొంది. ఆ షెల్టర్లలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి, కొద్ది రోజుల తర్వాత వాటి టెరిటరీలో వదిలేస్తారు. రేబిస్ రాకుండా వాటికి వ్యాక్సిన్లు వేస్తామని ఆ నివేదికలో తెలిపింది.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆరు జోన్లలో వెటర్నరీ అధికారులు? వీధి కుక్కల దాడులను నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతుండడంతో?నగరంలో ప్రజలు వణికిపోతున్నారు. వీధికుక్కలు ఎండాకాలంలో ఎక్కువగా దాడులు చేస్తాయని, తమ దగ్గరకు రోజుకు 300మంది కుక్క కాటు బాధితులు వస్తారని నారాయణ గూడ ఐపీఎం సెంటర్ డైరెక్టర్ శివలీల చెబుతున్నారు.ఇక నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పిచ్చి కుక్కల దాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆర్మూర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు వాపోతున్నారు



## కేటీఆర్ నుండి అలాంటి ప్రకటన...

ఎద్దేవా చేశారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. కేటీఆర్ నుండి ఇలాంటి ప్రకటన తమను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. 2019, 2024 లోక్ సభ ఎన్నికలలో కరీంనగర్ నుండి బీజేపీ గెలిచిందన్నారు. అలాగే మీ సోదరి కవిత నిజామాబాద్ లోక్ సభ స్థానం నుండి ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ విషయాలను గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. మీ మోదీ అంకుల్ గెలుపులో కీలక పాత్ర పోషించినందుకు మీ సోదరిని అభినందించాలని మద్యం కేసును ఉద్దేశించి కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగానికి మించిన వారు ఎవరూ లేరని లోక్ సభ ఎన్నికల ఫలితాల ద్వారా మోదీకి అర్థమయ్యేలా రాహుల్ గాంధీ చేశారని పేర్కొన్నారు. వారి నాయకత్వం మీ కుటుంబానికి అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుని పదవిని కట్టబెట్టేందుకు సహాయపడిందన్నారు. అయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సున్నాతో తుడిచిపెట్టుకుపోయిందని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రభావాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేయవద్దని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా వెనుకాడుతోందని చురక అంటించారు. నిజంగా అర్హులైన వారిని అభినందించడం మరిచిపోవద్దని, కనీసం నెక్ట్స్ టైమ్ బెటర్ లక్ అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## ఆర్థిక భరోసా కలిగించేలా...

జిల్లా బీసీ కార్పొరేషన్, చేనేత, జౌళిశాఖాధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీలను ఆర్థికంగా పైచేయి సాధించడానికి సీఎం చంద్రబాబునాయుడు బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇందుకోసం పాడి, గొర్రెలు, మేకల పెంపకం యూనిట్లు, మహిళలకు కుట్టుమిషన్లతో పాటు ఈవెంట్ మేనేజ్ మెంట్ నిర్వహణపై ఆర్థిక సాయమందించనున్నట్లు తెలిపారు. జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు కూడా ఆర్థిక సాయమందిస్తున్నామన్నారు. అన్నికుల వృత్తులవారికి ఆర్థిక భరోసా కలిగించేలా యూనిట్లఏర్పాటుకు సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నామన్నారు. బీసీ స్వయంఉపాధి యూనిట్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. రాబోయే రెండు నెలల కాలంలో జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు అన్ని యూనిట్లు గ్రౌండింగయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులకే ప్రాధాన్యమివ్వాలన్నారు. యూనిట్ల ఏర్పాటు ఇబ్బందులు రాకుండా జిల్లా స్థాయి బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఆధ్వర్యంలో యూనిట్ల నిర్వహణపై మంత్రి ఆరా తీశారు.

**చేనేతకు పెద్దపీట :**

జిల్లాలో చేనేత వస్త్రాల విక్రయాలకు తీసుకుంటున్న చర్యల గురించి చేనేత, జౌళి శాఖాధికారులను మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు చేనేత పరిశ్రమకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వీవర్ శాలలు, టెక్స్ టైల్స్ పార్కులతో చేనేత క్లస్టర్లు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు 365 రోజులూ పనికల్పించడమే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ధ్యేయమన్నారు. దీనిలో భాగంగానే చేనేతరంగానికి ఆర్థిక పరిపుష్టి కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామన్నారు. పలు రాయితీలు నేతన్నలకు అందిస్తున్నామన్నారు. ఈ సమీక్షాసమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, చేనేత జౌళి శాఖ ఏడీ పి.వరప్రసాద్, ఆప్కో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్వరరావు, ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఏడీ వెంకట్రావు, లేపాక్షి మేనేజర్ రవి తదితరులు పాల్గొన్నారు.


## ఆప్‌ను ప్రజలు...

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఢిల్లీ ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకున్నారని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ మాటలు ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఢిల్లీ ప్రజలు మార్పు కోరుకున్నారని అన్నారు. కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలకు తాగునీరు, సరైన రోడ్లు కూడా ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. కేజ్రీవాల్ మంచి చేస్తారని రెండుసార్లు గెలిపిస్తే అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని చెప్పారు. నీతి నిజాయితీతో రాజకీయం చేస్తానని గెలిచిన కేజ్రీవాల్ ఆ విధంగా చేయలేకపోయారని .. అందుకే ప్రజలు ఆప్‌ను ఘోరంగా ఓడించారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌కు అనుకూలమైన...

అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఎవరికి టిక్కెట్ ఇచ్చినా పార్టీలోని వారంతా ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, అలా చేయని పక్షంలో నష్టపోయేది మనమేనని ఆయన అన్నారు. లేకుంటే మనమే నష్టపోతామని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నుండి ఎన్నికైన ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలు, ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి సాధించింది శూన్యమని ఆయన విమర్శించారు.

## ఢిల్లీ ప్రజలు మార్పుకు...



చెప్పారు. రాజధాని ప్రజలు మార్పును కోరుకున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ఢిల్లీ ప్రజలు విసిగిపోయారని, ప్రస్తుత పరిస్థితిని మార్చాలని అనుకున్నారని చెప్పారు. ఎన్నికల్లో గెలుపొందిన అందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. ఇక మనం చేయాల్సిందల్లా... మరింత కష్టపడి పనిచేయడమేనని... క్షేత్ర స్థాయిలో ఉంటూ ప్రజల సమస్యలపై బాధ్యతగా పోరాడాలని చెప్పారు. కేరళలోని వయనాడ్ లోక్ సభ స్థానం నుంచి ప్రియాంకాగాంధీ గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె మూడు రోజుల పర్యటనకు గాను వయనాడ్ కు వెళ్లారు.

## ఢిల్లీ ప్రజలు ఇకపై ఆధునిక నగరాన్ని...



ఉంటాయని స్పష్టం చేశారు. మోదీ గ్యారెంటీ అంటే తప్పకుండా పూర్తయ్యే గ్యారెంటీ అని ఉద్ఘాటించారు. "ఢిల్లీని వాతావరణ కాలుష్యం, పారిశుధ్య సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమే అధికారంలో ఉంది. ఎన్డీయే పాలిత రాష్ట్రాలతో పోల్చితే ఢిల్లీలో పాలన ఎంత అధ్వానంగా ఉందో అందరూ చూశారు. అవినీతిపై పోరాడతామన్న వారే అవినీతిలో కూరుకుపోయారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అవినీతి కేసులో జైలుకు వెళ్లారు. అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారే ఎన్నో సంవత్సరాల పాటు పోరాడారు. ఇవాళ ఆ అవినీతి పార్టీ ఓటమిపై అన్నా హజారే కూడా సంతోషిస్తున్నారు. అభివృద్ధి వైపే ఉంటామని ఢిల్లీ ప్రజలు ఓటుతో ఘనమైన తీర్పు ఇచ్చారు. యమునా నది మనందరికీ పూజ్యనీయమైన నది. కానీ, ఆ నది పరిశుభ్రతను నిర్లక్ష్యం చేశారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న యమునా నదిని మేం ప్రక్షాళన చేస్తాం. యమునా నది పవిత్రతను కాపాడతాం. ఇది మోదీ గ్యారెంటీ" అంటూ ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ కాంగ్రెస్ పార్టీపైనా స్పందించారు. ఢిల్లీలో వరుసగా 6 ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతా తెరవలేదని ఎద్దేవా చేశారు. సున్నా సీట్లతో రెండు పర్యాయాలు హ్యాట్రిక్ కొట్టిన కాంగ్రెస్ కు గోల్డ్ మెడల్ ఇవ్వొచ్చని వ్యంగ్యం ప్రదర్శించారు. కాంగ్రెస్ నేతలను అర్బన్ నక్సల్స్ తో పోల్చారు. కాంగ్రెస్ నేతలు అర్బన్ నక్సల్స్ భాష మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాల్లో వివిధ వర్గాల ప్రజలను రెచ్చగొట్టడమే కాంగ్రెస్ పని అని మండిపడ్డారు.

## బీజేపీ 48 స్థానాలతో...




ఉన్నప్పటికీ, ఓటరు తీర్పు అందుకు భిన్నంగా ఉంది. వరుసగా రెండు పర్యాయాలు ఆప్ ను గెలిపించిన ఢిల్లీ ప్రజలు... ఈసారి బీజేపీకి జై కొట్టారు. ఈ విజయంతో 27 ఏళ్ల తర్వాత బీజేపీ మళ్లీ ఢిల్లీ పీఠాన్ని అధిష్ఠించబోతోంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీపై ఢిల్లీ ఓటర్లు ఏమాత్రం కరుణ చూపలేదు. సుదీర్ఘ చరిత్ర ఉన్న హస్తం పార్టీకి ఈ ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు కూడా రాలేదు. ఇక, బీజేపీ విజయంతో ప్రధాని మోదీ సహా బీజేపీ అగ్రనేతలు, కార్యకర్తలు పొంగిపోతున్నారు. ఈ నెల 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా... నేడు (ఫిబ్రవరి 8) ఓట్ల లెక్కింపు చేపట్టారు. బీజేపీ తిరుగులేని విజయం సాధించిన నేపథ్యంలో... కొత్త సీఎం ఎవరన్నది అత్యంత ఆసక్తికరంగా మారింది. మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు ఓటమి రుచిచూపిన పర్వేశ్ వర్మ తదుపరి సీఎం అంటూ ప్రచారం జరుగుతోంది. న్యూఢిల్లీ నియోజకవర్గం ఫలితం వెలువడిన వెంటనే పర్వేశ్ వర్మను కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. దాంతో, పర్వేశ్ వర్మ తదుపరి సీఎం అంటూ మరింత జోరుగా కథనాలు వచ్చాయి. అయితే, బీజేపీ ఢిల్లీ వ్యవహారాల ఇన్చార్జి బైజయంత్ పాండా మాత్రం... సీఎం ఎవరన్నది బీజేపీ హైకమాండ్ చూసుకుంటుందని, దీనిపై ఊహాగానాలు వద్దని సూచించారు.

## ఏపీ, ఢిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని



ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని, ఇది చారిత్రాత్మకం అని వివరించారు.కొందరు నేతలు సంక్షేమ కార్యక్రమాల పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇటువంటి కొందరు నేతల వల్ల రాజకీయ కాలుష్యం పెరుగుతోందని వ్యాఖ్యానించారు. ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో ఢిల్లీలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందని అన్నారు. కొన్ని విధానాలవల్ల ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారిందని తెలిపారు. ఒకప్పుడు పంజాబ్ రాష్ట్రానికి అన్ని రంగాల్లో మంచి పేరుండేదని, ఇవాళ పంజాబ్ అంటే డ్రగ్స్ గుర్తుకువస్తున్నాయని చంద్రబాబు విమర్శించారు. ఇటు, ఏపీలో వైసీపీ పాలనలో మద్యం మాఫియా తయారైందని ఆరోపించారు. ఏపీలో, ఢిల్లీలో అమలు చేసిన పాలసీలకు విజయం దక్కలేదని స్పష్టం చేశారు. ఏపీలోనూ, ఢిల్లీలోనూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని, ఓటేసిన పాపానికి ప్రజల భవిష్యత్తును కాటేశారని, ప్రజల అవకాశాలను పూర్తిగా నాశనం చేశారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సంపద సృష్టించలేని, ప్రభుత్వానికి ఆదాయం పెంచలేని నేతలు ఎందుకు? అని ప్రశ్నించారు. ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం పెరుగుతూ ఉండాలని... కానీ ఏపీ, ఢిల్లీలో ఈ అంశాలు తిరోమగనం చెందాయని అన్నారు. అయితే... ఏపీ, ఢిల్లీ ప్రజలు తప్పు తెలుసుకుని కష్టాల నుంచి బయటపడ్డారని చంద్రబాబు వెల్లడించారు. గుజరాత్ లో సుస్థిర పాలన కారణంగా వృద్ధి రేటు బాగా పెరిగిందని తెలిపారు. చాలా రాష్ట్రాలను దాటుకుని గుజరాత్ లో తలసరి ఆదాయం పెరిగిందని అన్నారు.

అనపర్తి ఎమ్మెల్యే కుమారుడి వివాహానికి హాజరైన సీఎం చంద్రబాబు :

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఓ వివాహానికి హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి వివాహం నేడు హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చంద్రబాబు విచ్చేశారు. వధూవరులు సుమేఘా రెడ్డి, మనోజ్ రెడ్డిలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు రాకతో పెళ్లి వేడుకలో భారీ కోలాహలం నెలకొంది.

# అరవింద్‌కు కవిత షాక్....

హైదరాబాద్, : నిజామాబద్ ఎంపీ... తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు కవితను 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓడించి సంచలన సృష్టించారు ధర్మపురి అరవింద్. రాజకీయాల్లోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే బీజేపీ తరఫున ఎంపీ టికెట్ తెచ్చుకున్నారు. వంద రోజుల్లో పసుపు బోర్డు తెస్తారని రైతులకు బాండ్ రాసి ఇచ్చి ఎన్నికల బరిలో దిగారు. దీంతో రైతులంతా అరవింద్‌కు మద్దతుగా నిలిచి గెలిపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీపీసీ అధ్యక్షుడిగా పనిచేస డి.శ్రీనివాస్ తనయుడు ధర్మపురి అరవింద్ . 2018 రాజీకీయాల్లో అడుగు పెట్టారు. బీజేపీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున నిజామాబాద్ ఎంపిగా బరిలో దిగారు. అక్కడ సిట్టింగ్ ఎంపీగా ఉన్న అప్పటి సీఎం కేసీఆర్ తనయ, కల్వకుంట్ల కవితను ఢీకొట్టారు. కవితను ఓడించేందుకు తనను గెలిపిస్తే వంద రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు రైతులకు బాండ్ పేపర్ కూడా రాసి ఇచ్చారు. దీంతో పసుపు రైతుల మద్దతుతోపాటు మోదీ మేనియాతో ఆ ఎన్నికల్లో అర్వింద్ ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి ఎంపీ అరవింద్.. కల్వకుంట్ల కవితపై విమర్శలు చేయడం ప్రారంభించారు. మరోవైపు కవిత కూడా పసుపు బోర్డుపై అరవింద్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందిఇదిలా ఉంటే.. అరవింద్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారు. ఆయన గెలుపులో సోషల్ మీడియా పాత్ర కూడా ఉంది. సోషల్ మీడియా వేదికగానే అప?పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, తనపై పోటీచేసి ఓడిపోయిన కవిత, అప్పటి మంత్రి కేటీఆర్‌పైనా విమర్శలు చేసేవారు. ఇప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. ఎక్స్, ఫేస్‌బుక్‌లో తరచూ మోదీ, కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిజామాబాద్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటుంటారు. ఈ క్రమంలోనే అర్వింద్ ఆర్మీ పేరుతోనూ సోషల్ మీడియా ఖాతా ఎక్స్‌లో ఉంది.ఇటీవల అర్వింద్ ఆర్మీ ఖాతాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మీద అసభ్యకరమైన మార్ఫెడ్ ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తున్నారు. దీనిని గుర్తించిన ట్విటర్.. ఈ ఖాతాను నిలిపివేసింది. ఈమేరు అధికారికంగా ట్వీట్ చేసిషాక్ ఇచ్చింది. అరవింద్ టీం నడిపించే అకౌంట్‌ను సస్పెండ్ చేసినట్లు పేర్కొంది. మహిళలను అవమానించేలా అసభ్యకరమైన ఫొటో, వీడియోలు పోస్ట్ చేసినందుకు ఖాతా నిలిపివేస్తున్నట్లు ఎక్స్ అధికారికంగా ప్రకటించింది.

## పలమనేరు పట్టణ పోలీస్ స్టేషన్ లో ......
## హాజరై సంతకం చేసిన మాజీ ఎమ్మెల్యే.



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి08: పలమనేరు నియోజకవర్గం పలమనేరు పట్టణ పోలీస్ స్టేషన్ నందు శనివారం మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ్ హాజర య్యారు.కొలమా సనపల్లి పంచాయతీ మాదిగ బండ క్వారీని ఆక్రమించుకున్నా రని అందు లోని వాహనాలను దౌర్జన్యంగా తరలించారని క్వారీ యజమాని జనార్ధన్ నాయుడు హైకోర్టులో పెట్టిన కేసుల విషయమై సి.ఐ. నరసింహారాజు ముందర హాజరై సంతకాలు పెట్టాల్సిందిగా హైకోర్టు ఉత్తర్వుల మేరకు హాజరయ్యారని సమాచారం. మాజీ ఎమ్మెల్యే వెంట వైసిపి రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, పలువురు నాయకులు కౌన్సిలర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మామిడి సాగులో ప్రకృతి సేంద్రీయ పద్ధతులు....
## అధిక దిగుబడులకు లాభదాయకం
### ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రమేష్



సదుం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 08: మామిడి సాగులో అధిక దిగుబడుల కు ప్రకృతి సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన మందులు పిచాకారి ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ రమేష్ అన్నారు. సదుం మండలం బూరగ మంద పంచాయతీ దేవదారు మాకుల పల్లిలో రైతు నాగరాజు సాగుచేసిన 7 ఎకరాల పొలంలో మామిడి తోటలో నీ మాస్త్రం తయారుచేసే విధానం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానంతో మామిడిలో రసం పీల్చే పురుగులు నివారించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పర్యవేక్షకులు ముని చంద్ర, శ్రీనివాసులు రెడ్డి, రామచంద్ర, రైతులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో భాజపా జయకేతనం
### శాంతిపురం భాజాపా,జనసేన పార్టీ శ్రేణుల సంబరాలు



శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి08: ఢిల్లీ ఎన్నికల్లో భాజపా పార్టీ ఘనవిజయం సాధించడంతో శాంతిపురం మండల కేంద్రం లో భాజపా, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు బాణాసంచా కాల్చి మితాయి లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మండల పార్టీ అధ్యక్షుడు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు గజేంద్ర కాశీనాథ్ జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కిషోర్ మరియు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ హాస్పిటల్ తిరుపతిలో
## నూతన బ్రాంచ్ ప్రారంభించిన సందర్భంగా ....
## శుభాకాంక్షలు తెలియజేసిన నేతలు




వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ హాస్పిటల్ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో నూతన బ్రాంచ్ ప్రారంభించిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసిన వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి గ్రామం టిడిపి బూత్ కమిటీ అధ్యక్షుడు బోడి రెడ్డి రామకృష్ణారెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడి రెడ్డి చంగల్ పండు రెడ్డి రాష్ట్ర బిజెపి నాయకులు బోడి రెడ్డి హనుమంత్ రెడ్డి గ్రామ టిడిపి యువ నాయకులు కే తిరుమల్ రెడ్డి బి మురళి రెడ్డి స్థానిక సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పిల్లి.. తెచ్చిన లొల్లి

నల్గోండ: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఒక పిల్లి కేసు పోలీసులకు తలనొప్పులు తేస్తోంది. స్థానికంగా వుంటున్న పుష్పలత తన కూతురి కోసం మూడేళ్ల కిందట చిన్న పిల్లి కూనను కొని తెచ్చి పెంచుకుంది. కొద్ది రోజుల కిందట ఆ పిల్లి ఇంటి నుంచి తప్పిపోయింది. కూతురు కి ఎంతో ఇష్టమైన పిల్లి కోసం ఆ కుటుంబం చుట్టుపక్కల వెతకని చోటే లేదు. ఈ క్రమంలో.. తెలిసినవాళ్లు పిల్లి పలానా వీధిలో కనిపించింది అని సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ ఆ పిల్లి కోసం వెతికిన శ్రమ అంతా వృధా అయిపోయింది. హఠాత్తుగా వారం కిందట ఇంటి గేటు ముందు ఆ పిల్లి ప్రత్యక్షం అయింది. ఆ పిల్లి దిన పరిస్థితి చూసి శుభ్రంగా పిల్లికి స్నానం చేయించి.ముస్తాబు చేశారట. ఆ పిల్లి మెడలో ఉన్న ట్యాగ్ కు ఫోన్ నెంబర్ చూసి అవాక్కయ్యారు. “మా పిల్లి మెడలో ట్యాగ్ కట్టి ఫోన్ నెంబర్ రాశారు. . ఆ ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి.. ఇంతకీ ఎవరు మీరు..? మా పిల్లి మీ దగ్గర ఎందుకు ఉంది..?”అంటూ ప్రశ్నించారు.

## షాపు యాజమాన్యులకు సిసి కెమెరా తప్పనిసరి
### డి.ఎస్.పి నరసింహమూర్తి



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: శ్రీకాళహస్తి తిరుపతి జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజ్ ఆదేశాలు మేరకు శ్రీకాళహస్తిలో రాబోయే మహా శివరాత్రి సందర్భంగా , ప్రతిరోజు శ్రీకాళహస్తి పట్టణంలోఎక్కువగా దోపిడీలు జరుగుతున్న కారణంగా శ్రీకాళహస్తి డిఎస్ పి నరసింహమూర్తి శనివారం మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.ఆయన మాట్లాడుతూ గవర్నమెంట్ ల్యాండ్స్ , బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం,హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం,రాత్రి పూట గ్రూపులుగా తిరగడం శ్రీకాళహస్తిలో తరచు దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి కాబట్టి ముందుగ హెచ్చరిడుస్తున్నాము . పట్టుకుంటే కట్టినమైన చర్యలు ఉంటాయన ఈ విషయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు .అనవసరంగా రాత్రి వేళల్లో రోడ్లపై తిరగరాదని అటువంటి వారిపై చర్యలు వుంటాయన్నారు.కొత్త వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని అనుమానితులు కనిపిస్తే పోలీస్ శాఖ వారికి తెలియజేయాలని ఆయన అన్నారు.రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించడం జరుగుతుందని దొంగతనాలు జరగకుండా చూస్తామన్నారు.ఈ విషయంలో ప్రజల సహకారం కూడా అవసరం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ గోపి ,టూ టౌన్ సిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఢిల్లోలో బీజేపీ విజయం సంతోషకరం
### తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డా. చంద్రప్ప.



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: శ్రీకాళహస్తి ఢిల్లోలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం గర్వించదగ్గ విషయమని తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డా. చందప్ప వ్యాఖ్యానించారు. అభివృద్ధి కోసం ఢిల్లీ ప్రజలు బీజేపీని ఆశీర్వదించారని ఆయన గుర్తు చేశారు. గత 10 సంవత్సరాల ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో ఢిల్లీలో అభివృద్ధి కుంటుబడిందని , అందుకే ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని డా. చంద్రప్ప ఆరోపించారు. అవినీతికి ఆస్కారం లేకుండా పరిపాలన చేస్తానని అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్, అవినీతే ఏకైక ఆశయంగా ఆమ్ ఆద్మీ పార్టీని నడిపించారని ఆయన దుయ్యబట్టారు. దేశంలో అభివృద్ధి కేవలం బీజేపీతోననే సాధ్యమనే వాస్తవాన్ని దేశ ప్రజలు గ్రహించారని ఆయన అన్నారు. ఇకనైనా ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు ఇతర ప్రాంతీయ పార్టీలు ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం కాకుండా అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం పని చెయ్యాలని డా. చంద్రప్ప హితువు పలికారు. ఢిల్లీలో బీజేపీ విజయంతో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ ఢిల్లీ మరింత అభివృద్ధి చెందేలా చేస్తారని ఆయన ప్రశంసించారు.

### చట్టాల ద్వారా ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ న్యాయ వ్యవస్థ పై......
## ప్రజలకు నమ్మకాన్ని పెంచాలి : సుప్రీంకోర్టు న్యాయమూర్తి



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి08 :పలమనేరు చట్టాల ద్వారా ప్రజల ప్రాథ మిక హక్కులను కాపాడుతూ న్యాయ వ్యవస్థ పై నమ్మకాన్ని పెంచాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ తెలిపారు.శనివారం బెంగళూరు రోడ్డులో.15.18 కోట్లతో నూతనంగా నిర్మించిన నాలుగు కోర్టు భవనాల సముదాయాన్ని, నలుగురు జడ్జిల నివాస భవన సముదాయాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్ తో కలిసి ప్రారం భించారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు హైకోర్టు జడ్జి మరియు చిత్తూరు అడ్మిని స్ట్రేషన్ జడ్జి జస్టిస్.కృష్ణ మోహన్,హైకోర్టు జస్టిస్ టి.సి.డి శేఖర్ లు,తదితరులు పాల్గొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం నకు విచ్చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి మరియు హైకోర్టు చీఫ్ జస్టిస్ లకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్ పి మణికంఠ చందోలు,పుష్ప గుచ్ఛం తో స్వాగతం పలక గా పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం సుప్రీంకోర్టు న్యాయ మూర్తి పోలీసులచే గౌరవ వందనం స్వీక రించారు.అనంతరం సర్వమత ప్రార్ధనలు చేసిన నూతన భవనాలు ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా సుప్రీంకోర్టున్యాయ మూర్తి మాట్లాడుతూ, మదనపల్లి వాసిగా జిల్లాతో,ఉమ్మడి చిత్తూరు లోని పలు న్యాయవాదులతో సత్సంబంధాలు కలిగి ఉన్నానన్నారు. గతంలో వృత్తి రీత్యా మద నపల్లి నుండి చిత్తూరు వెళ్లే సమయంలో పలమనేరు మీదు గా ప్రయాణం చేయవ లసి ఉండేదన్నారు.ఆంధ్రప్రదేశ్, కేరళ హైకోర్ట్ లాంటి పలు న్యాయస్థానాల ప్రారం భోత్సవాల కార్యక్రమాలకు సుప్రీంకోర్టు కోర్టు జడ్జి హోదాలో హాజరు కావడం జరి గిందన్నారు. పలమనేరులో మెరుగైన మౌలిక సదుపాయాలతో న్యాయస్థాన భవనం నిర్మించారన్నారు. న్యాయవాదుల లో నూతన ఉత్సాహాన్ని పెంపొందించ డానికి, ప్రజలకు న్యాయ వ్యవస్థ పై నమ్మ కం కలిగించడంలో భాగంగా స్వయంగా కార్యక్రమానికి హాజరు కావడం జరిగింద న్నారు. సమస్యలతో వచ్చే ప్రజలకు న్యాయం అందించి ప్రజలకు న్యాయ వ్యవ స్థ పై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ భారతి, పలమనేరు సివిల్ జడ్జి ఆది నారా యణ, సివిల్ జడ్జి లిఖిత,స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ,పలమనేరు ఆర్ డి ఓ భవానీ, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారక నాథ రెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎపి ఫోరం ఫర్ అంగన్వాడి......
## యూనియన్ వార్షికోత్సవం.



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి08: పలమనేరు ఏపీ ఫోరం ఫర్ అంగనవాడి వర్కర్స్, హెల్పర్స్ ,అండ్ మినీ వర్కర్స్ యూనియన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పలమనేరు పట్టణంలో జాతీయ మానవ హక్కుల కార్యాలయం నందు ఆ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి అధ్యక్షతన భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ ప్రథమ వార్షికోత్సవానికి ఆ యూనియన్ చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు డివి మునిరత్నం ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏపీ ఫోరం పర్ అంగన్వాడి యూనియన్ ఏర్పడి ఒక సంవత్సరం గడుస్తున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ప్రారంభము నుండి కూడా ఇప్పటివరకు తమ యూనియన్ అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. అంగన్వాడీలకు ఉన్న సమస్యలను ఇప్పటికే అనేక చోట్ల ముందుండి యూనియన్ పరిష్కారం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు పడుతున్న బాధలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయంగా ఫోరం పర్ అంగన్వాడి యూనియన్ ని ఏర్పాటు చేశామని తమ యూనియన్ దోపిడీ , స్వార్ధం లేని సహకారం అందించడానికి అంగన్వాడీలను భుజం తట్టి మేల్కొల్పడానికి సిద్ధంగా ఉందన్నారు. అలాంటి నిజాయితీ నిబద్ధతతో పనిచేస్తున్నాం కాబట్టి తమ యూనియన్ను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అంగన్వాడి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఆహ్వానించడం శుభ పరిణామం అన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్రములో అంగన్వాడిలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో అంగన్వాడీలకు సమస్య వచ్చినప్పుడు నిర్భయంగా తమ యూనియన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వాసుపత్రిలో పిల్లలకు సంబంధించిన జనన ధ్రువ పత్రాలను సకాలంలో పంపిణీ చేస్తే అంగన్వాడీలు ఆధార్ కార్డులు తీసుకోవడానికి వీలుంటుందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలకమ్మా, నాగరత్న, భాగ్యలక్ష్మి, నిర్మల, మునెమ్మ, కవితమ్మ, శ్రీదేవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ హాస్పిటల్
### నూతన బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా
### శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు నాయకులు



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ హాస్పిటల్ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో నూతన బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసిన వెదురు కుప్పం టిడిపి నాయకులు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్ ముని చంద్రా రెడ్డి,మాజీ మండల పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి, క్లస్టర్ ఇంచార్జి కోనేరు చెంగల రాయ రెడ్డి యూనిట్ ఇంచార్జి ముతాలం రాజా రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ నాయుడు, నాయకులు రాజా రెడ్డి, ఐనాం కొత్తూరు గ్రామ కమిటి అధ్యక్షులు పి.ధర్మా రెడ్డి మరియు, కొమర గుంట గ్రామ కమిటి అధ్యక్షులు మోహన్ రెడ్డి.

## ప్రభుత్వ పాతశాలలో ....
## స్కూల్ బ్యాగులు పంపిణీ

సికింద్రాబాద్: విర్ధుస ఫౌండేషన్ అధ్వర్యంలో బేగంపేట్ లోని పాటిగడ్డ ప్రభుత్వ పాఠశాల లో అమీర్పేట డివిజన్ కార్పొరేటర్ కేతినేని సరళ గారి సహకారముతో 500 విద్యార్థులకి స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం జెరిగింది ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సిహెచ్ ప్రభాకర్ డివిజన్ అధ్యక్షులు ఎం.మహేష్ కుమార్ ,టి.వెంకటేష్ యాదవ్,లోహిత్ తదితరులు పాల్గొనడం జెరిగింది

# ఐవీఎఫ్ ద్వారా 70 వేల మంది పిల్లలను పుట్టించాను...
### తిరుపతి మహానగరంలో సి ఎఫ్ సి హాస్పిటల్ ప్రారంభంలో పాల్గొన్న ఐదు మంది ఎమ్మెల్యేలు
### ఐ వి ఎఫ్ ట్రీట్మెంట్ కి ఆరోగ్యశ్రీ వర్తించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తా.. ఎమ్మెల్యే డాక్టర్ థామస్




ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి మహానగరంలో చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభ మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ ఐదు మంది ఎమ్మెల్యేలు చేత అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ మహోత్సవానికి మాజీ మంత్రులు టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.తిరుపతి లో చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభం అయిన తర్వాత ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ... నేను చెన్నై పాండిచ్చేరి కలకత్తా హైదరాబాద్ దుబాయ్ తిరుపతి ఇతర దేశాల్లో చాలా హాస్పిటల్లో ప్రారంభించాను ఈ హాస్పిటల్ లో ఐవీఎఫ ద్వారా సుమారు 70000 మంది పిల్లలను టెస్ట్ బేబీ ద్వారా పుట్టించాను,ఇప్పుడు ప్రస్తుతం మన దేశంలో పిల్లల పుట్టడం చాలా వరకు తగ్గింది దీనికి కారణం మనం తీసుకునే ఆహార లోపం వల్ల వీర్యకణాలు తక్కువగా ఉండటం వల్ల అలాగే కుటుంబ కలహాలు వల్ల వారికి పిల్లల పుట్టక పోవడానికి కారణాలు అవుతున్నాయి. అన్నారు. ఈ ఐ వి ఎఫ్ ట్రీట్మెంట్ పేదలకు వర్తించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో మాట్లాడు తానని అన్నారు.అలాగే తిరుపతిలో నూతన హాస్పిటల్ ఏర్పాటు చేయాలని తిరుపతి పీలేరు అనంతపురం, కడప ప్రాంతాల ఉన్నవారు కోరిక మేరకే ఇక్కడ హాస్పిటల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం మాజీ ఎమ్మెల్యే ముబ్బు దేవ నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాజీ ఎమ్మెల్యే గాంధీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య సాఫ్ట్వేర్ బాలు మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడు బి కే ఎన్ మునివర్ధనాయుడురాజశేఖర్ నాయుడు మాజీ సర్పంచ్ కుప్పయ్య మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ నియోజకవర్గ యువత కోఆర్డినేటర్ కిషన్ చంద్ కొత్తపల్లి సూరి రెడ్డి కొత్తపల్లి దాసరి సతీష్ జీవన్ కుమార్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు మైనారిటీ నాయకుడు మాబు భాష పుల్లూరు దాము పుల్లూరు బాబు పుల్లూరు వెంకటేష్ గంగమాంబాపురం సాఫ్ట్వేర్ మహేష్ ఢిల్లీ ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశ వేడుకకు ......
## ముఖ్య అతిథిగా బి.ఎమ్.జి.ఎఫ్
## చైర్మన్ సుమతీ రెడ్డి.



పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 08: అన్నమయ్య జిల్లా పీలేరు కలికిరి మండలం రాజువారిపల్లి లో శనివారం తిమ్మాడి సోదరులు, తిమ్మాడి మోహన్ రెడ్డి, తిమ్మాడి కిరణ్ కుమార్ రెడ్డి లు నూతనంగా నిర్మించిన ఇంటిలో శనివారం శుభముహూర్తాన గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ సుమతీ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పులి సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. వారికి తిమ్మాడి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనం తరం నూతన గృహప్రవేశం పాల్గొని తిమ్మా డి కుటుంబ సభ్యులకు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తాతిరెడ్డి,మాన్యం రాజా రెడ్డి, యల్లంపల్లి సహదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పఠాన్ లను బీసీ లలో చేర్చండి
### ప్రభుత్వ సలహాదారు షరీఫ్ కు జాకీర్ పఠాన్ వినతి




పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: అన్నమయ్య జిల్లా పీలేరు పర్యటన కు శనివారం విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సలహాదారులు ఎండి షరీఫ్ కు పఠాన్ రిజర్వేషన్ల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జాకీర్ పఠాన్ వినతి పత్రం అందజేశారు. ముస్లింలు ఉన్న పఠాన్ లను బీసీ ఈ కింద చేర్చి వారికి రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ఆయన కోరారు.రాష్ట్రంలో లక్షకు పైగా పఠాన్ కుటుంబాలు ఉన్నాయని, వీరు గత 15 సంవత్సరాలుగా రిజర్వేషన్ సౌకర్యం పొందలేక ఉపాధి ,విద్యా రంగాలలో చాలా వెనుకబడి ఉన్నారని పక్క రాష్ట్రమైన తెలంగాణలో పఠాన్ లు బీసీలు గా ఉన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ముస్లింలను బీసీలు చేర్చిరారని,రాష్ట్ర విభజన తర్వాత వీరిని విస్మరించారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీరిని బీసీలలో చేర్చి వీరి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అర్బన్
## పి.ఈ.ఎస్ ఆస్పత్రిలో ....
## ఉచిత కంటి వైద్య శిబిరం



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుప్పం అర్బన్ పి ఈ ఎస్ ఆస్పత్రి లో శనివారం నాడు పిఈఎస్ ఆసుపత్రి వారి సౌజన్యం తో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో దీర్ఘకాలిక కంటి సమస్యలు బాధపడుతున్న వారు వంద మందికి పైగా పాల్గొన్నారు. ప్రతి నెల రెండవ శనివారం నాడు లయన్స్ క్లబ్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పా టు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ అడ్వైజర్ డా. ఎ. మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారు తమ నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో పాల్గొని ఉచిత వైద్యాన్ని అందుకుంటున్నారని, ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి పరీక్షలు నిర్వ హించి ఎవరైనా కంటి శస్త్ర చికిత్సకు అర్హులు అయితే వారికి అధునాతన సాంకేతికతో పి ఈ ఎస్ ఆసుపత్రి నందు చికిత్సను అందిస్తారని ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వందమందిలో 15 మంది శస్త్ర చికిత్సకు వైద్యులు సిఫార్సు చేసినట్లు ఆయన తెలిపారు. వైద్య సేవలో పాల్గొన్న వారికి లయన్ డాక్టర్ జి ఎన్ రమేష్ కుటుంబ సభ్యులు భోజన ఏర్పా ట్లు చేసినారు. వారి కుటుంబ సభ్యులను లయన్స్ క్లబ్ అధక్ష్యులు సోమశేఖర్, కార్యదర్శి సెంథిల్ కుమార్,కోశాధికారి చరణ్ అభినందించా రు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం, మధు సూదన్, డా.కృష్ణ మూర్తి,నాగరాజ్,శివ ప్రసాద్,ఏకాంబరం, పి ఆర్ ఓ ధనశేఖర్, సీతారాం,సిబంది పాల్గొన్నారు.

### ఉత్తమ్‌తో వేణుగోపాల్...
## రహస్య చర్చలు

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల పది మంది ఎమ్మెల్యేలు రసహ్యంగా భేటీ అయ్యారు. ఇది పార్టీలో సంచలనం రేపింది. వారం రోజులుగా దీనిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సీఎలీ?ప సమావేశంలో చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. ఇక ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీరు కూడా హస్తం పార్టీకి తలనొపి?పగా మారింది. దీనిపైనా టీపీసీసీ సీరియస్‌గా స్పందించింది. ఇలాంటి తరుణంలో ఢిలీ?లలోనూ ఓ రహస్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణతోపాటు టీపీసీసీ పదవల భర్తీ విషయమై అధిష్టానంతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడి?డ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫిబ్రవరి 6న ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు.

### చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్ ఆధ్వర్యంలో .....
## బిజెపినాయకుల విజయోత్సవ సంబరాలు





కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి08: కుప్పం పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో స్థానిక బిజెపి నాయకులు విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఎన్నికలలో బిజెపి ఘన విజయం సాధించిన సందర్భంగా కుప్పం పట్టణం నందు స్థానిక బిజెపి నాయకులు టపాకాయలు పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అభివృద్ధి వైపు పైనిస్తోందని, ప్రధాని పాలనను చూసిన ప్రజలు బిజెపి వైపు ఆకర్షితులవుతున్నట్టు తెలిపారు. ఇందుకు నిదర్శనంగా ఢిల్లీలో బిజెపి విజయం నిలుస్తుందన్నారు. దేశాభివృద్ధి బిజెపితోనే సాధ్యమని, నరేంద్ర మోడీ నాయకత్వంలోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని నమ్మి బీజేపీకి ప్రజలు పట్టం కట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్, కుప్పం అర్బన్ అధ్యక్షులు నితీష్, మండల అధ్యక్షులు వడివేలు, శాంతిపురం మండల అధ్యక్షులు గజేంద్ర, గుడుపల్లి మండల అధ్యక్షులు రామచంద్రుడు, స్టేట్ కౌన్సిల్ నెంబర్ కాశీనాథ్, ఓబీసీ శ్రీధర్, ముత్తు వేలు, జనసేన కుప్పం ఇంచార్జ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ రాజధాని అభివృద్ధి కోసమే ఢిల్లీలో బీజేపీ విజయం
### శ్రీకాళహస్తిలో కోలాహాలంగా బిజేపీ శ్రేణుల విజయోత్సవ వేడుకలు



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 08: శ్రీకాళహస్తి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ శ్రీ కోలా ఆనంద్ నేతృత్వంలో శ్రీకాళహస్తి పట్టణంలోని బెరివారి మండపం కూడలి వద్ద బీజేపీ నేత కోలా ఆనంద్ నేతృత్వంలో భారీ స్థాయిలో విజయోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో డబుల్ ఇంజన్ సర్కారు వలన ఢిల్లీ అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ దేశాన్ని నాశనం చేస్తే . కేజ్రీవాల్ ఢిల్లీని భ్రష్టుపట్టించారు. వాయు, రాజకీయ కాలుష్యంతో కలుషితం జరిగిందన్నారు. ఈ గెలుపు ఢిల్లీ అభివృద్ధికీ మలుపు అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్, జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్వీ రమణ, పట్టణ అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి, వేదం కృష్ణయ్య, చిలకా రంగయ్య, సొట్ట సుకుమార్, బగీర్తి వెంకటేష్, కోలా గోవర్ధన్, కుప్ప ప్రసాద్, ధర్మయ్య యాదవ్, కూనాటి నాగరాజు, కోనేటి అయ్యప్ప, మోదుగుల నాగరాజు, రాఘవలు నాయుడు, హరీష్, మురళీ, వెంకటసుబ్బయ్య, పుణ్యం డిల్లీ కుమార్ రెడ్డి, అముదల మునిరాజ, కటికం చెందు, లింగబతిన గోపాల్, దక్కిలి శివ, నారాయణ, బొక్కసం యుగంధర్, కనపర్తి రవి తేజ, చొక్కాని రవిచంద్ర, పుచ్చకాయలు రమేష్ యాదవ్, హరి, డిల్లీ, రాజనాల, బిందు కుమార్, చిత్తికాటు బాలాజీ, గిరిధర్ సాయి, చైతన్య, సిద్ధా, ప్రదీప్, తులసి, పవన్, నాని, గాలి రమేష్ నాయుడు, అబ్దుల్లా, పేట సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆ ముగ్గురిలో ఎవరికి...
### - ఉత్తరాంధ్ర పీఠంపై ఆశలు

విశాఖపట్టణం, : వైసీపీ సభ్యత్వానికి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. దీంతో ఫ్యాన్ పార్టీలో ఆయన శకం ముగిసింది. ఆయన రాజీనామాతో ఉత్తరాంధ్ర నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానికేతర నాయకుడ్ని తమ నెత్తిన రుద్దుతున్నారంటూ కొందరు గుర్రుగా ఉన్నారు. సాయిరెడ్డి వెళ్లిపోవడంతో నేతలు రిలీఫ్‌గా ఫీలవుతున్నారు. ఈసారి ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ పదవి తమ ప్రాంతం వారికి దక్కుతుందనే ఆలోచనలో ఉన్నారు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నేతలు.ఈ పదవికి ఉత్తరాంధ్ర నుంచి ముగ్గురు నేతలు పోటీపడుతున్నారట. తొలుత ఈ పదవి వైవీ సుబ్బారెడ్డి అప్పగించాలని ప్లాన్ చేసిందట వైసీపీ హైకమాండ్. కాకపోతే ఉత్తరాంధ్ర నేతల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైనట్టు సమాచారం. వైవీ హయాంలో కేవలం రెండు సీట్లకు పార్టీ పరిమితమైందని, ఆయనకు ఇస్తే కేడర్ చెదిరిపోయే ప్రమాదముందని నేతలు అధిష్టానం వద్ద ప్రస్తావించారట. ఆ పదవికి ఉత్తరాంధ్ర నేతలను నియమించాలనే ఆలోచన చేస్తోంది.ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ పదవికి ముగ్గురు నేతలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా మాజీ మంత్రులే కావడం గమనార్హం. ఒకరు ధర్మాన ప్రసాదరావు, మరొకరు బొత్స సత్యనారాయణ, ఇంకొకరు గుడివాడ అమర్నాథ్. తొలుత ఈ పదవిని ధర్మాన ప్రసాదరావు లేదా కృష్ణదాస్‌కు ఇవ్వాలని భావించిందట. తర్వాత ఏమైందోగానీ వెనక్కి తగ్గిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఓటమి తర్వాత ప్రసాదరావు పార్టీలో యాక్టివ్‌గా లేరు. కేడర్‌ను పలకరించిన పాపాన పోలేదు. జగన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాలకు, ఆందోళన కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఒకవేళ ఆ పదవి ఇచ్చినా న్యాయం చేస్తారన్న నమ్మకం నేతల్లో కనిపించలేదు.మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేరు వెలుగులోకి వచ్చింది. తొలుత ఆయనను ఆ పదవి ఇవ్వాలని భావించినా, ఎందుకోగానీ ఆ పార్టీ వెనక్కి తగ్గిందని సమాచారం. కేవలం ప్రత్యర్థులపై విమర్శలు తప్పితే.. నేతలు, కేడర్‌తో ఆయనకు అంతగా సంబంధాలు లేవన్నది వైసీపీ అంతర్గత రిపోర్టులో తేలిందట. దీంతో ఆయన్ని పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. ఇక మూడో వ్యక్తి మాజీ మంత్రి, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ రేసులో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ పదవి ఆయనకు దక్కే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మండలిలో అడుగుపెట్టడం, ప్రతిపక్ష నేతగా కేబినెట్ ర్యాంకు సొంతం చేసుకున్నారు. ఆ తరహా హోదా వైసీపీలో కేవలం బొత్సకు మాత్రమే ఉంది. బొత్స సామాజిక వర్గం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో బలంగా ఉంది. నేతలను సమన్వయం చేసి కలిసి పని చేసిన నేతగా ముద్ర ఉంది. ఆయనకు ధీటైన నేత లేకపోవడంతో కలిసి రావడం ఖాయమని అంటున్నారు. రేపో మాపో ఉత్తర్వులు రావచ్చన్నది బొత్స మద్దతుదారుల మాట. మరి హైకమాండ్ బొత్సకు ప్రయార్టీ ఇస్తుందా?ఎలాగూ ప్రతిపక్ష నేతగా ఉండడంతో మరొకరికి ఆ పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉందా? ఇలాంటి ప్రశ్నలు ఉత్తరాంధ్ర నేతలను వెంటాడుతున్నాయి. కాకపోతే కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ఇచ్చినా ఆశ్చర్యపోనకర్లేదని అంటున్నారు. గడిచిన పదేళ్లు ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ పదవిని దగ్గరవాళ్లకు మాత్రమే ఇచ్చారు జగన్. ఇప్పుడు అవినాష్ రెడ్డికి ఇచ్చినా ఆశ్యర్యపోనకర్లేదని అంటున్నారు. మొత్తానికి ఈ గాసిప్స్‌కు తెరపడాలంటే కొద్దిరోజులు వెయిట్ చేయక తప్పదు మరీ

# జగన్ 2.0 ఎలా ఉండబోతోంది....



విజయవాడ, : వైఎస్ జగన్ జనవరి 11న లండన్ వెళ్లి ఫారిన్‌లో లాంగ్ బ్రేక్ తీసుకున్న తర్వాత యాక్టివ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇండియా వస్తూనే డైరెక్ట్ హైదరాబాద్ లేదంటే విజయవాడ కాదు.. బెంగళూరులో ల్యాండ్ అయ్యారు. యలహంక ప్యాలెస్ వెళ్లారు. తాజాగా అమరావతి వచ్చారు. సో ఇప్పుడు మ్యాటర్ జగన్ లండన్ టూర్ కాదు. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ లో విజయవాడ నగరపాలక సంస్థ వైసీపీ కార్పొరేటర్లతో పాటు ముఖ్య నేతలతో భేటీ నిర్వహించడం, అందులో చెప్పిన మాటల చుట్టూ ఇప్పుడు రాజకీయం గరంగరంగా మారింది.ఈసారి వచ్చే జగన్ 2.0 వేరుగా ఉంటుందన్నారు. కార్యకర్తల కోసం జగన్ ఏం చేస్తాడో చూపిస్తానన్నారు. గతంలో పార్టీ శ్రేణులకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వ లేకపోయానన్నారు. జగన్ 1.0లో కార్యకర్తలకు గొప్పగా చేయలేకపోయా. మొదటే ప్రజలే గుర్తొచ్చారు.. వారికోసమే తాపత్రయపడ్డానన్నారు. ఇప్పుడు కార్యకర్తల్ని చంద్రబాబు సర్కార్ పెడుతున్న ఇబ్బందులు చూస్తున్నానని, వారికి అండగా ఉంటానన్నారు. ఇప్పుడు వస్తున్న క్వశ్చన్ ఏంటంటే ఇన్నాళ్లూ కార్యకర్తల్ని ఎందుకు పట్టించుకోలేదు? విపక్షంలో ఉన్నప్పుడే గుర్తొచ్చారా అన్న పాయింట్స్ తెరపైకి వస్తున్నాయి. అంతే కాదు.. మాజీ సీఎం జగన్ మళ్లీ కలల్లో తేలిపోతున్నారా అన్నది కూడా చర్చనీయాంశమైంది. మనిషి మారలేదా అన్నది పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఏపీని వైసీపీ 30 ఏళ్ల పాటు పాలిస్తుందని, కథ మార్చేస్తామని అంటున్నారు.ఇప్పుడు జగన్ పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన క్లియర్ కట్ సందేశం ఏంటంటే.. కేసులకు భయపడొద్దు, జైల్లో పెట్టినా తగ్గొద్దు.. రెట్టించిన ఉత్సాహంతో పార్టీకోసం పని చేయాలంటున్నారు. నిజానికి ఇదే కార్యకర్తల కోసం తన తొలి టర్మ్ పాలనలో ఏమీ చేయలేదని జగన్ ఒప్పుకున్నా.. మనస్ఫూర్తిగా చెప్పలేని విషయాలు చాలానే ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది. నిజానికి పవర్ లో ఉన్నప్పుడు తాడేపల్లి ప్యాలెస్ లోకి ఎవరినీ పెద్దగా అనుమతించలేకపోయారు.నిజానికి ఏ లీడరైనా గెలవాలంటే ముఖ్య కారణం గ్రౌండ్ లెవెల్‌లో పని చేసే కార్యకర్తలే. కానీ వైసీపీలో మాత్రం గత ఐదేళ్లు పూర్తిగా రివర్స్. రావాలి జగన్.. మమ్మల్ని కలవాలి జగన్ అంటూ ఒక దశలో కార్యకర్తలు తాడేపల్లి ప్యాలెస్ ముందు నినాదాలు కూడా చేశారు. వైసీపీ ఓడిన తర్వాత కూడా వెళ్లి కలుద్దామన్న వారికి చుక్కెదురు తప్పలేదు. ఇంకా చెప్పాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తాడేపల్లి ప్యాలెస్ ముందున్న రోడ్లలో ఆంక్షలు తొలగిపోయి సామాన్య జనం రాకపోకలకు వీలు కల్పించారు. గతంలో ఫొటోలు, గుర్తింపు కార్డులు చూపించిన తర్వాతే జనాన్ని రోడ్డుపైకి పోలీసులు అనుమతించే వారు. అదీ పరిస్థితి. నిజానికి జగన్ అసెంబ్లీకి వెళ్లడం లేదు. అక్కడ ప్రజా సమస్యలను ప్రస్తావించడం లేదు. కావాల్సినంత నెంబర్ లేకపోయినా ప్రతిపక్ష హోదా కావాలంటున్నారు. ప్రస్తుతం 11 సీట్లే వైసీపీకి ఉన్నాయి.ఇలాగే చేస్తే ఆ 11 మందిలో కూడా ఉండేదెవరో.. ఊడేదెవరో అన్న డౌట్లు పెరుగుతున్నాయి. ఎందుకంటే సభలో విపక్షం ఉండాలి. అప్పుడే ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుంది. కానీ తాను మీడియా ముందే అధికార పక్షాన్ని నిలదీస్తానని జగన్ పట్టుబట్టుక్కూర్చున్నారు. లేటెస్ట్ గా సభలో సీఎం మాట్లాడినంత టైం ఇస్తారా అని క్వశ్చన్ చేస్తున్నారు జగన్. సభలో ఎదురెదురుగా కూర్చుని ఫైటింగ్ చేసుకోవాల్సిన పని లేదని కొత్త ఫార్ములా వినిపిస్తున్నారు. జగన్ 2.0 అంటే ఉన్న 11 సీట్లు కూడా ఖతమే అని టీడీపీ నేతలు కౌంటర్లు వేస్తున్నారుప్రతిపక్షంలో ఉంటే కేసులు మీద పడుతాయి.. అధికారంలోకి వస్తే పోతాయి ఇదే ఫార్ములాతో మాజీ సీఎం జగన్ ఉంటున్నారు. వైనాట్ 175 అన్నారు. తీరా 11కు పరిమితం అయ్యారు. దారి కనిపించడం లేదు. అందుకే కార్యకర్తల రాగం అందుకున్నారా అన్న డౌట్లు పెరుగుతున్నాయి. మరోవైపు జగన్ ప్రతిపక్షంలోకి షిఫ్ట్ అయ్యాక.. మాటి మాటికి బెంగళూర్ టూర్ పెట్టుకుంటున్నారు. అక్కడ ఏం చేస్తున్నారో తెలియదు. ఎవరెవరితో భేటీలు జరుపుతున్నారో తెలియదు. అంతా సీక్రెట్. ఒకప్పుడు చంద్రబాబు, పవన్ మాటి మాటికి పక్క రాష్ట్రాలకు వెళు _న్నారంటూ విమర్శలు చేసిన జగన్.. ఇప్పుడు అదే రూట్ లో వెళ్తున్నారు. యలహంక ప్యాలెస్‌లో మకాం వేస్తున్నారు. దీనిపైనా అధికార కూటమి పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పనులు, అక్రమాలపై వరుసగా కేసులు నమోదవుతున్నాయి. కూటమి ప్రభుత్వం విచారణలకు ఆదేశిస్తోంది. లేటెస్ట్‌గా లిక్కర్ కేసులో అక్రమాలు వెలుగులోకి తెచ్చేందుకు విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. 2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకూ మద్యం విధానం ముసుగులో ఏం జరిగింది. ఎవరెవరు ఎంత నొక్కారన్న విషయాలపై సిట్ తేల్చబోతోంది. ఇదే కేసుపై గతేడాది సెప్టెంబర్ 23న ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. నాటి ప్రభుత్వ పెద్దలకు సన్నిహితులు, బినామీలకు నిర్దేశిత కమిషన్లు చెల్లించిన మద్యం సరఫరా కంపెనీలకే అత్యధిక శాతం కొనుగోలు ఆర్డర్లు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. సో దీనిపై పాలకు పాలు నీళ్లకు నీళ్లు తేల్చేయబోతున్నారు. దీనిపైనా జగన్ గరం గరం అవుతున్నారు. మద్యం లింకులకు తమ పార్టీ వాళ్లకు ఏం సంబంధం అంటున్నారు.ఇప్పటికే వైసీపీలో చాలా మందికి కేసుల భయం పట్టుకుంది. నందిగం సురేశ్, కుక్కల విద్యాసాగర్, బోరుగడ్డ అనిల్ లాంటి వారు జైలుకెళ్లారు. సజ్జల విచారణ ఎదుర్కొన్నారు. కేసులు.. కోర్టులు విచారణలంటూ తిరుగుతున్నారు. ఇంకొందరైతే రాష్ట్రం వదిలేసి తమ సొంత పనులు చూసుకునేందుకు వెళ్లిపోతున్నారంటున్నారు. సిచ్యువేషన్ ఇలాగే ఉంటే పార్టీ సంగతేంటన్న ప్రశ్నలూ వస్తున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఎంతమందిపై అక్రమ కేసులు పెట్టారో గుర్తు చేసుకోవాలని మంత్రి లోకేష్ కౌంటర్ ఇచ్చారు.నాయకుడు ఒకటి చెప్పారంటే దాన్ని కచ్చితంగా ఫాలో అయి అందరికీ ఆదర్శంగా ఉండాలి. కానీ జగన్ విషయంలో అలా జరగడం లేదు. ప్రభుత్వాన్ని నిలదీస్తానంటున్న మాజీ సీఎం అసెంబ్లీకి మాత్రం వెళ్లడానికి ఇష్టం చూపడం లేదు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 190 ప్రకారం 60 రోజుల పాటు ఒక ఎమ్మెల్యే సభ అనుమతి లేకుండా అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, సభ అతని స్థానాన్ని ఖాళీగా ప్రకటించవచ్చని చెబుతోంది. అయితే 60 రోజుల వ్యవధిని లెక్కించడంలో, సభను ప్రోరోగ్ చేసిన లేదా వరుసగా నాలుగు రోజుల కంటే ఎక్కువ కాలం వాయిదా వేసిన కాలానికి లెక్కలోకి తీసుకోవద్దన్న నిబంధన ఉంది. సో వేటు పడకుండా ఉండాలంటే అసెంబ్లీకి వచ్చి టెక్నికల్ గా సంతకం చేసి వెళ్లేలా చూసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది. మొత్తంగా గత ఐదేళ్లలో ఎలా విధ్వంసం చేశారో కూటమి పార్టీలు లెక్కలతో సహా వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036